## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

**చంద్రగిరి:** పేద ప్రజల ఆలోచనలోల్ నుంచి పుటుకొచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నియోకజవర్గ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో సంయుక్తంగా తెలిపారు. ఉదయం 8.30 గంటలకు చంద్రగిరిలోని పాత పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### ఎస్వీయూలో పోస్టర్ల ఆవిష్కరణ

**తిరుపతి సిటీ:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నెలకు రూ.3 వేలు భృతి అందించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరగనున్న యువత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుచానూరు నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### వైద్య సేవలపై సమీక్ష




పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎంఓ

**పాకాల:** గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలకు అందిస్తున్న వైద్య సేవలపై డీపీఎంఓ శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. మంగళవారం మండలంలోని దామలచెరువు పీహెచ్‌సీని ఆయన సందర్శించి గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సేవలతో చిన్నపిల్లల టీకాల వివరాలను పరిశీలించారు. క్షేత్రస్థాయి పురోగతి వివరాలను ఆశాలు, ఏఎన్ఎంలు ఈ-యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవిరామ్, డీపీఓ ప్రకాష్, పర్యవేక్షకులు నరేష్‌బాబు, అంజలీదేవి, గణాంకాధికారి నాగేంద్రకుమార్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి

**తిరుపతి కల్చరల్:** రాష్ట్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరగా చర్యలు చేపట్టి కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని పోలీస్ కోచింగ్ కోచ్ కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జనవరి 22న అభ్యర్థులకు ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించారని తెలిపారు. ఈ ప్రక్రియపై పలు కేసులు నమోదు కావడంతో మెయిన్స్ నిర్వహణ ఆగిపోయిందన్నారు. మంత్రి లోకేష్ స్పందించి త్వరగా పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

### పోటాపోటీగా క్రీడలు



పోటీల్లో తలపడుతున్న మహిళా ఉద్యోగులు

**తిరుపతి కల్చరల్:** టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో వివిధ క్రీడా పోటీలు పోటాపోటీగా సాగాయి. ఇందులో భాగంగా మహిళా అధికారుల క్యారమ్స్ సింగిల్స్ పోటీల్లో డాక్టర్ సుహార్‌లత విజయం సాధించగా డాక్టర్ కుసుమకుమారి రన్నర్‌గా నిలిచింది. అలాగే క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో డాక్టర్ సుహార్‌లత, దామర సెల్వి విజేతలుగా, డాక్టర్ కుసుమకుమారి, నీలిమ రన్నర్స్‌గా నిలిచారు. 45 ఏళ్లపైబడిన పురుష ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో కిరణ్‌కుమార్ రాజు విజయం సాధించగా, ఆంజనేయులు రన్నర్ స్థానం కైవసం చేసుకున్నారు. టేబుల్ టెన్నిస్ డబుల్ పోటీల్లో మురళి, ఆంజనేయులు విజయం సాధించగా, కిరణ్‌కుమార్‌రాజు, కృష్ణమూర్తి రన్నర్ స్థానం సాధించారు. 45 ఏళ్లపైబడిన మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్స్ పోటీల్లో స్వప్న మంజరి విజేతగా, పద్మ రన్నర్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్స్ పోటీల్లో శ్రీలక్ష్మి విజేతగా, మహాలక్ష్మి రన్నర్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు మహిళా ఉద్యోగుల షటిల్ డబుల్స్ పోటీలలో భవ్య, లహరి విజేతలుగా, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి రన్నర్స్‌గా నిలిచారు. అలాగే మహిళా ఉద్యోగులకు పరుగు పందెం, నడక పోటీలతో పాటు హిట్టింగ్ ది ఇండియన్ క్లబ్, బాల్‌త్రో, లెమన్ స్పూన్, బకెటింగ్ ది బాల్, షాట్‌పుట్ వంటి పోటీలు నిర్వహించారు.

### తప్పిన ప్రమాదం

**శ్రీకాళహస్తి:** తొట్టంబేడు మండలం చెన్నై బైపాస్ లింకు రోడ్డు వద్ద గ్యాస్ పైప్ లైన్లు మరమ్మతుల కోసం తీసిన గోతిలో ఒకరు ప్రమాదవశాత్తు పడబోయి డ్రైవర్ అప్రమత్తతో తృటిలో తప్పింది. రోడ్డు పక్కన గ్యాస్ లైన్ ఏర్పాటు కోసం తీస్తున్న గోతుల వద్ద ఏ విధమైన భద్రతా చర్యలు పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

# మా బాధ.. ప్రభుత్వానికి పట్టదా?

- పిల్లల గోస చూస్తే గుండె తరుక్కుపోతోంది
- వెటర్నరీ జూడాల ఆకలికేకలు వినబడలేదా ?
- ప్రభుత్వం, వర్సిటీ అధికారుల వైఖరి మారాలి
- న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాడండి
- పిల్లలపై బెదిరింపులకు దిగితే ఖబడ్దార్
- సమ్మె శిబిరం వద్ద జూడాల తల్లిదండ్రులు



విద్యార్థులతో కలసి సమ్మెలో పాల్గొని నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు



వర్సిటీ అధికారులతో సమావేశమైన విద్యార్థుల తల్లిదండ్రులు

**తిరుపతి సిటీ:** గౌరవ వేతనం పెంచాలంటూ గత 37 రోజులుగా తరగతులు బహిష్కరించి రోడ్డెక్కి సమ్మె చేస్తున్న వెటర్నరీ జూడాలను మంగళవారం తల్లిదండ్రులు పరామర్శించారు. శిబిరం వద్దకు పెద్దఎత్తున తల్లిదండ్రులు చేరుకోగానే విద్యార్థులు ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మమేకమై వర్సిటీలో జరుగుతున్న పరిస్థితులను వివరించారు. అందరి వైద్య విద్యార్థులకు ఇస్తున్న స్టైఫండ్‌ను తమకు ఇవ్వాలని నెలరోజులకు పైగా నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా కనీసం స్పందించడం లేదని తమ గోడును మొరపెట్టుకున్నారు.

**న్యాయం జరిగే వరకు పోరాడండి..**

పశువైద్య విద్యార్థులపై వర్సిటీ అధికారులు చూపుతున్న పక్షపాత ధోరణి మంచిది కాదని విద్యార్థుల తల్లిదండ్రులు హితువు పలికారు. వారు గొంతెమ్మ కోర్కెలు కోరలేదని, న్యాయమైన డిమాండ్‌ను మాత్రమే పరిష్కరించమని అడుగుతున్నారని తెలిపారు. న్యాయం జరిగే వరకు పోరాట బాటను విడవకూడదని, తాము అండగా నిలుస్తామని భోరసా ఇచ్చారు.

**అధికారుల చర్చలు విఫలం**

విద్యార్థులను పరామర్శించి మద్దతు తెలిపిన అనంతరం వర్సిటీ వీసీ, అధ్యాపకులను తల్లిదండ్రులు కలిశారు. అధికారులు వారితో పలు అంశాలపై చర్చించి నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని విద్యార్థులు వాపోయారు. పిల్లలను కంట్రోల్‌లో పెట్టుకోవడం తెలియదా అంటూ వర్సిటీ అధికారులు తల్లిదండ్రులతో ఘాటుగా మాట్లాడారని వెటర్నరీ జూడాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మర్యాద కూడా తమ తల్లిదండ్రులకు ఇవ్వకుండా అవమానించారని మండిపడ్డారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పిల్లలు సమ్మె విరమించరని తల్లిదండ్రులు అధికారులకు తెగేసి చెప్పి బయటకు వచ్చారు.

**గుండె బరువెక్కుతోంది..**



“ న్యాయం కోసం పిల్లలు గత 37 రోజులుగా రోడ్డుపై సమ్మె చేస్తున్న దృశ్యాలు చూస్తుంటే గుండె బరువెక్కుతోంది. వైద్యవృత్తిని సమానంగా చూడాల్సిన అధికారులు పక్షపాతం ప్రదర్శించడం సహించలేని విషయం. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి ఇప్పటికైనా పిల్లలకు న్యాయం చేయాలి.

– హరిత, వెటర్నరీ జూడా ప్రత్యూష, తల్లి

**అధికారులు అర్థం చేసుకోవాలి**



వెటర్నరీ జూడాలు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వ, అధికారులు సమన్వయంతో వారికి న్యాయం చేయాలి. గౌరవవేతనాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అందులో న్యాయం ఉంది. అన్యాయమని తెలిస్తే తల్లిదండ్రులుగా తాము ఎలా ఊరుకుంటాం. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– వకుళ, వెటర్నరీ జూడా పూజిత తల్లి

**విద్యార్థులకు అండగా ఉంటాం**



విద్యార్థులు చేస్తున్న సమ్మెకు మా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. అధికారులతో చర్చించాం. కానీ వారు సరిగా స్పందించలేదు. రూ.7 వేల గౌరవవేతనం నెలరోజులకు ఎలా సరిపోతుంది. ప్రతి నెలా ఖర్చులకు మేము పంపుతున్నాం. విశిష్టమైన పశువైద్య వృత్తిని అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం, వర్సిటీ అధికారులు అండగా నిలబడాల్సింది పోయివారిపై మొండివైఖరిగా వ్యవహరించడం దారుణం

– మాధవి, వెటర్నరీ విద్యార్థి హితేష్ తల్లి

**సమ్మె ఆపవద్దు**



రాష్ట్రంలోని అన్ని వైద్య విభాగాల్లో విద్యను అభ్యసిస్తూ ఇంటర్న్‌షిప్ చేస్తున్న యూజీ విద్యార్థులకు నెలకు రూ.25 వేలు ఇస్తున్నారు. వెటర్నరీ జూడాలకు కేవలం రూ.7 వేలు ఇవ్వడం దారుణం. ఇది వైద్యవృత్తిని అవమానించడం కాదా ? నెల రోజులకు పైగా సమ్మె చేస్తున్నా అధికారులు స్పందించరా ? సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించవద్దని పిల్లలకు చెప్పాం.

– రాజేష్, వెటర్నరీ విద్యార్థిని హారిక సోదరుడు

## నగరంలో నేటి కార్యక్రమాలు

- మారుతీనగర్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఉదయం 8.45 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించి, అనంతరం మీడియా సమావేశం.
- సాయినగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపు తొలగించాలని కోరుతూ ఉదయం 9 గంటలకు మద్యం షాపు వద్ద సీపీఐ నిరసన దీక్ష ప్రారంభం, హాజరు కానున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు నిరసన, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ
- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం 10 గంటల నుంచి క్రీడా పోటీలు
- ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ఆధ్వర్యంలో తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధి వీధిలో మధ్యాహ్నం 2.30 గంటలకు రీజనల్ సెంటర్ ప్రారంభం
- స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల ముగింపు కార్యక్రమం
- జాతీయ సంస్కృత యూనివర్సిటీలో చెలికాని అన్నారావు భవన్‌లో ఉదయం 11 గంటలకు జాతీయ నూతన విద్యా విధానంపై జాతీయ సదస్సు
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పరిపాలన భవనం రామేశ్వరంలో ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై 21 రోజుల అంతర్జాతీయ కార్యశాల ప్రారంభం
- మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ సెవన్త్ ఎడిషన్-2025లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో ఉదయం 10 గంటలకు క్రికెట్ లీగ్ పోటీలు జరుగుతాయి.

# యువత పోరుకు తరలిరండి



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి (ఫైల్)

**తిరుపతి రూరల్:** పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా, నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేయడాన్ని నిరసిస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించే 'యువత పోరు' కార్యక్రమానికి తరలి రావాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9.30గంటలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

**యువత పోరుకు తరలిరండి**

**తిరుపతి మంగళం:** విద్యాసంవత్సరం పూర్తవుతున్నా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రజాద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న × యువత పోరు× కార్యక్రమానికి విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు.

# స్విమ్స్‌లో క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం



సర్జరీ అనంతరం ఆరోగ్యంగా ఉన్న బాలికతో వైద్యులు, పేరెంట్స్

**తిరుపతి తుడా:** గుంటూరు జిల్లా మాచెర్ల నగరానికి చెందిన ఎస్.సైదాబీ (12) బాలిక ఛాతీలో గడ్డ ఏర్పడడంతో తల్లిదండ్రులు స్విమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. డాక్టర్లు బాలికకు అన్ని పరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా సిటీ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ బాలిక సైదాబీకి ఛాతీ, ఊపిరితిత్తుల మధ్య భాగంలో గడ్డ ఏర్పడిందని తెలిపారు. ఇది క్లిష్టమైన శస్త్ర చికిత్స కావడంతో ఎయిమ్స్ డాక్టర్లు స్విమ్స్‌కు రెఫర్ చేశారన్నారు. ఇక్కడి వైద్యులు పరీక్షించి విజయవంతంగా ఆపరేషన్ చేశారన్నారు. ప్రస్తుతం బాలిక పూర్తి ఆరోగ్యంగా ఉందని, సుమారు రూ.5 లక్షలు ఖర్చయ్యే శస్త్రచికిత్సను టీటీడీ ప్రాణదానం ట్రస్ట్ ద్వారా ఉచితంగా చేశారు. దీనిపై బాలిక తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

### ఈ-కేవైసీపై సామాజిక తనిఖీ

**పాకాల:** రబీ ఈ-పంటను తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ పుష్పావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 790 ఎకరాల్లో 669 మంది రైతులు ఈ-పంట యాప్‌లో పంటను నమోదు చేసుకున్నారని, ఇప్పటి వరకు 772 ఎకరాలకు సంబంధించి 651 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. రైతులు తమ అభ్యంతరాలను ఈ నెల 18వ తేదీ లోపు తెలపాలని, తుది జాబితాను 22వ తేదీన విడుదల చేస్తామన్నారు. తుది జాబితా తరువాత ఎలాంటి మార్పులు ఉండవని తెలిపారు.

# ఔషధ మొక్కల సాగుతో అదనపు ఆదాయం

- జాతీయ ఔషధ మొక్కల బోర్డు, రీజనల్ డైరెక్టర్ డా.కె.సి.చాకో



గుత్తివారిపల్లిలోని అంతర పంటలను పరిశీలిస్తున్న జాతీయ ఔషధ మొక్కల బోర్డు సభ్యులు

**రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్):** ఉద్యాన పంటల్లో స్వల్పకాలిక ఔషధ మొక్కలను అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని జాతీయ ఔషధ మొక్కల బోర్డు, రీజనల్ డైరెక్టర్ డా.కె.సి.చాకో అన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో మంగళవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు ఔషధ మొక్కల సాగు, మార్కెటింగ్‌పై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న కాలంలో ఔషధ మొక్కల సాగుకు మంచి ప్రాముఖ్యత ఉంటుందని, స్వల్పకాలిక పంటలైన అశ్వగంధ, సర్పగంధ, బావంచాలు మొదలైన వాటిని ఉద్యాన పంటల్లో అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా రైతుకు అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. డా.యూ.ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఔషధ మొక్కలు పండించే రైతులు కలిసి ఒక రైతు ఉత్పత్తిదారు సంఘంగా ఏర్పడి సాగు చేసి, మార్కెటింగ్ చేస్తే మంచి గిట్టుబాటు ధరలు పొందవచ్చన్నారు. అదేవిధంగా మంచి నాణ్యమైన ఉత్పత్తి చేసిన వారికి మార్కెటింగ్ లో జాతీయ ఔషధ మొక్కల బోర్డు సహకారం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కె.వి.కె హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు పద్మజ, దివ్యసుధ, ఎస్ఆర్ఎఫ్‌లు చిరంజీవి, అఖిల్, రైతులు పాల్గొన్నారు.

# ఆహారంపై అవగాహన అవసరం



డాక్టర్ శంకర్‌ను సత్కరిస్తున్న వైద్యులు, అధికారులు

**తిరుపతి తుడా:** మానవుడి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి ఆహారం తీసుకోవాలో ప్రతి వ్యక్తికి అవగాహన అవసరమని ఎన్టీఆర్ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ తెలిపారు. మంగళవారం ఎస్వీ వైద్య కళాశాలలో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆహారమే ఔషధం అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యాన్ని నివారించడంలో తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై జాగ్రత్త వహించాలని సూచించారు. డయాబెటిస్ విషయంలో ఆహారం-ఆరోగ్యంపై ఉన్న అపోహలపై ఆయన జాగ్రత్తలు, సూచనలు అందించారు. క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులకు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర ఆహార అలవాట్లు ఎలా కారకమవుతున్నాయో తెలిపారు. అనంతరం ఆయనను అధికారులు జ్ఞాపికతో సత్కరించారు. సదస్సులో రుయా విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ కిరీటి, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ మాధవీలత, డాక్టర్ డీఎస్ మూర్తి, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆశాలత, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

# శ్మశాన వాటికలను శుభ్రంగా ఉంచండి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

**తిరుపతి తుడా:** నగరంలోని శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ 33 వార్డులోని హరిశ్చంద్ర శ్మశాన వాటిక, దోబీఘాట్, సుందరయ్య నగర్, స్కావెంజర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, అధికారులతో కలసి కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శ్మశానం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తాచెదారం ఉండడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. శ్మశానంలో నెలకొన్న సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికలను, దోబీఘాట్‌ను శుభ్రంగా ఉంచాలని, కర్మక్రియలకు వచ్చే వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సుందరయ్య నగర్, రైల్వే కాలనీ, స్కావెంజర్స్ కాలనీలో ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, అధికారులు ఉన్నారు.

# హామీలను పట్టించుకోకుంటే పోరాటమే



తిరుపతి ఇండియన్ బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

**తిరుపతి అర్బన్:** బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుంటే పోరాటం తప్పదని తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సంఘం కన్వీనర్ విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి ధన్వంత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం తిరుపతిలోని వైకేటీ రోడ్డులోని ఇండియన్ బ్యాంకు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 24, 25 తేదీల్లో ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని ప్రభుత్వాలపై మండిపడ్డారు. సాధ్యం కాని కోర్కెలు తాము కోరడం లేదని, న్యాయబద్ధమైన కోర్కెలను మాత్రమే అడుగుతున్నామని స్పష్టం చేశారు. బ్యాంకుల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిని రద్దు చేస్తూ.. శాశ్వత ఉద్యోగులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా వెళ్తే.. తప్పదు జరిమానా



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

**తిరుపతి రూరల్:** తిరుపతి ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారిపై గత వారం రోజులుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు అడ్డదిడ్డంగా నడిపే ఏ వాహనాన్ని అయినా సరే నిలబెట్టి జరిమానా విధిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం హైవే రోడ్డులోని ఆటోనగర్ సర్కిల్ నుంచి ఆర్‌సీ పురం జంక్షన్ వరకు వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారిపై వన్ వేలో వస్తున్న వారికి భారీగా జరిమానాలు విధించగా రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులకు కొత్తగా అమల్లోకి వచ్చిన మోటార్ వెహికల్ చట్టం - 1998 (అమెండ్‌మెంట్ ఇన్- 2019) వాటిపై అవగాహన కల్పించారు. మొత్తం 27 వాహనాలను సీజ్ చేసినట్టు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి తెలిపారు. సీఐలు సంజీవ్ కుమార్, భాస్కర్ నాయక్ పురుషోత్తం రెడ్డి, ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి అనంతకృష్ణ శర్మ



ప్రసంగిస్తున్న శతావధాని మురళి



రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ అధికారులు

**తిరుపతి కల్చరల్:** సంగీత, సాహిత్య రంగాల్లో అపారమైన జ్ఞానం కలిగిన రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అని శతావధాని ఆముదాల మురళి కొనియాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం అనంతకృష్ణ శర్మ 46వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాళ్లపల్లి సంగీతం, సాహిత్యం రెండు కళ్లు లాంటివని, అన్నమయ్య సంకీర్తనలను రాగి రేకుల నుంచి పరిష్కరించి గ్రంథస్తం చేయడంతో పాటు వందల కృతులను స్వరపరిచారని తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ 'రాళ్లపల్లి వారి విమర్శ సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం రాళ్లపల్లి మనవరాలు, జాతీయ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ రాళ్లపల్లి దీప్త మాట్లాడుతూ రాళ్లపల్లి వారికి సంస్కృతం, ప్రాకృతం, తెలుగు, కన్నడ భాషల్లో మంచి పాండిత్యం ఉందన్నారు. అప్పటి ఈఓ సీవీఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా నియామకమైన రోజే అనంతకృష్ణశర్మ పరమపదించారని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దీనికి ముందు శ్రీపద్మావతి మహిళా వర్సిటీ మార్గంలోని రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో డీపీపీ ఏఈఓ రాములు, రాళ్లపల్లి రఘునందన్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో పురప్రజలు పాల్గొన్నారు.

# నేటికీ స్త్రీలపై వివక్ష బాధాకరం



ప్రసంగిస్తున్న అధ్యాపకులు భీమన్న

**తిరుపతి సిటీ:** ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ నేటికీ స్త్రీల పట్ల వివక్షత కొనసాగుతుండడం విచారకరమని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ ఎన్.భీమన్న ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ కటాక్షమ్మ పాల్‌రాజ్ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ధనానికి లక్ష్మీదేవిని, శక్తికి పార్వతిని, విద్యకి సరస్వతిని నిదర్శనంగా చూపించినా ఆధునిక యుగంలో స్త్రీలకు ఇంకా సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయన్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ దళిత స్త్రీలు వారి జీవనంలో ఎదుర్కొన్న సమస్యలను అక్షరీకరించారన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యక్షుడు కొలకలూరి మధుజ్యోతి, డాక్టర్ సుభాషిణిగారు, డాక్టర్ యువశ్రీ, లక్ష్మీప్రియ, పరిశోధక, తెలుగు, ఆంగ్ల శాఖల విద్యార్థినులు పాల్గొన్నారు